# న్యాయం కోసం

ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే ఫ్లయిట్ కోసం, సెక్యూరిటీ చెక్ కూడా అయిపోయిన తర్వాత, డిపార్చర్ కాల్‌కోసం, ఎదురు చూస్తూ డాక్టర్ నందా, నేనూ లాంజ్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. "గుడ్‌మార్నింగ్ మిస్ మందాకినీ" అంటూ పరిచయమైన గొంతు విని పక్కన వొచ్చి కూర్చున్న ప్రసాద్‌కేసి చూసి "గుడ్ మార్నింగ్. ఈయన డాక్టర్ నందా..." అంటూ పరిచయం చేయబోయేను.

"తెలుసు. డాక్టర్ నందగోపాల్. మీ మినిష్టర్ పరిమళా సోమేశ్వర్రావుగారి మేనల్లుడు, హిమ్స్ నర్సింగ్‌హోం అధినేత, రియల్ ఎస్టేట్ మేగ్నెట్ గుర్నాధంగారి ఏకైక పుత్రుడు, ఆర్నెల్లు అమెరికాలో ట్రెయినింగ్ అయిన హైదరాబాద్ తిరిగొస్తుదన్నట్లు వార్త నిన్ననే అన్ని పత్రికల్లోనూ ఫోటోతో సహా పడింది" అన్నాడు ప్రసాద్.

"ఓ! గాడ్! మా నాన్నగారికిదో చాదస్తం. మీరు హైదరాబాద్ ఎడిషన్స్‌లో చాశారా?" అడిగేడు నందా.

"చూసేరా అంటారేమిటి? వేశారా అని అడగండి. ఆయన ప్రసాద్ అని ఆంధ్ర మెయిల్ సబ్ ఎడిటర్. కాలేజ్‌లో నాకు నాలుగేళ్ల సీనియర్. ఇతని సిస్టర్ నా క్లాస్‌మేట్" అన్నాను పరిచయం చేస్తూ.

"మిస్ మందాకినీ! మిమ్మల్నో ప్రశ్న అడగటానికొచ్చేను. జపాన్ నుంచి వొస్తున్న కల్చరల్ డెలిగేషన్ హైదరాబాద్ రాకుండా, ఆ అవకాశాన్ని చేతులారా బెంగుళూర్ కిచ్చెయ్యడంలో మీ వుద్దేశ్యం ఏమిటి? వాళ్ల సాంస్కృతిక కార్యక్రమాలు, హస్తకళల ప్రదర్శనం, వాటి అమ్మకాలు మనకెంత ఉపయోగకరమో తెలుసా!" అడిగేడు ప్రసాద్. నిజానికి ఆ అవకాశాన్ని వినియోగించుకోకపోవడం నా కిష్టం లేదు. కాని మా మినిష్టర్ కంత మంచి పేరు లేదు. ఇది శ్రద్ధా, బాధ్యత ఖర్చుతో కూడుకున్న పని. అందుకే వెనకంజ వేసింది. నా మాట వినలేదు.

"మా మినిష్టర్‌గారు తోటి మినిష్టర్లతో సంప్రదించి ఈ నిర్ణయం తీసుకున్నారు. నేనేం చెయ్యగలను?" అన్నాను. జర్నలిస్ట్‌లతో ఎంత తక్కువగా, ఎంత సహనంతో మాట్లాడితే అంత మంచిది. అందులోనూ ప్రసాద్ చాలా తెలివైన వాడు. జర్నలిస్ట్‌గా మంచి పేరుంది. పైగా నా దగ్గిర చనువుంది.

"నేనేం చెయ్యగలను అనడం బాధ్యతారహితమైన మాట. దాని ప్రాముఖ్యతని గురించి మీ మినిష్టర్‌కి తెలియకపోతే మీరు నచ్చచెప్పి ఒప్పించడం మీ విధి" అన్నాడు ప్రసాద్ నేననుకున్నట్టుగానే.

"మిష్టర్ ప్రసాద్. ఈవిడ విధులు ఈవిడకి తెలుసు. మినిస్ట్రీ ఫర్ కల్చరల్ ఎఫైయిర్స్‌లో సెక్రటరీ. ఐ. ఏ. ఎస్ ఆఫీసర్" అన్నాడు నందా అనవసరంగా జోక్యం చేసుకుంటూ.

"ఐ.ఏ.ఎస్. అంటే 'ఇగోయిజం ఎక్వయిర్డ్ సిండ్రోం' అని చాలామంది అనుభవజ్ఞుల అభిప్రాయం. ఏమైనా చాలా పెద్ద తప్పుచేశారు" అన్నాడు ప్రసాద్.

"థేంక్స్ ఫర్ యువర్ సెర్మన్. అంత ముఖ్యమైన కార్యక్రమాన్ని చెడగొట్టేం అనుకుంటే ముఖ్యమంత్రితో చెప్పుకోండి" అన్నాను ఒళ్లుమండి.

"నేను ఢిల్లీ వొచ్చిందే జపాన్ డెలిగేషన్ ప్రోగ్రాం గురించి తెలుసుకోడానికి. మీరు చేసిన నిర్వాకం విన్నాక నిన్న సాయంత్రం యిక్కడే సి. యంని కలుసుకుని చెప్పేను. ఆయన ముక్కు మీద వేలేసుకుని సెంట్రల్ మినిష్టర్ ప్రభాకర్ మిశ్రాని కలుసుకుని క్షమాపణ చెప్పుకుని ఆ జపాన్ కల్చరల్ డెలిగేషన్ని హైదరాబాద్‌కి ఆహ్వానించేడు. గుడ్ డే టు బోతాఫ్ యు" అంటూ డిపార్చర్ కాల్ విని లేచేడు, బ్రీఫ్ కేస్ అందుకుని. మేమూ లేచేం.

ఫ్లైయిట్‌లో కూర్చుని ఇండియన్ ఎయిర్‌లైన్స్ వాళ్ల 'స్వాగత్' పత్రిక తిరగేస్తుంటే యాదృచ్ఛికంగా 'ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఆఫ్ జపాన్' అన్న వ్యాసం మీద నా దృష్టి పడి చదివేను. విస్తీర్ణంలో జపాన్ మన ఆంధ్ర రాష్ట్రమంత వుంటుంది. రెండో ప్రపంచ యుద్ధంలో ఆటం బాంబుల విధ్వంస కాండకు గురైన ఏకైక దేశం. 'హిరోషిమా', 'నాగసాకి' నగరాల విధ్వంసం మానవ చరిత్రలో మరపురాని విషాద ఘట్టం. జనాభాలో ఇరవై అయిదు శాతం అంతరించేరు. మరో పదిహేను శాతం వికలాంగులయ్యేరు. అటువంటి దేశం అచంచల విశ్వాసంతో, అనన్య జాతీయ సమగ్రతతో ఒక చైతన్య స్రవంతిగా రూపొంది అవిరామ కృషితో ప్రపంచంలో ఒక అగ్రశ్రేణి జాతిగా అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించింది. సచిత్రమైన ఆ వ్యాసం చదివేక జపాన్ సాంస్కృతిక బృందం పట్ల మేము చూపెట్టిన నిర్లక్ష్యానికి తల వొంచుకోక తప్పలేదు. మనస్సులోనే ప్రసాద్ చర్యని అభినందిచేను.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నందా తల్లితండ్రులు, బంధుమిత్రులు పూలదండలతో అతన్ని అభినందిస్తుండగా నేను బయటకు జారుకొని, నా కోసం కాచుకు కూర్చున్న డ్రయివర్‌కి సూట్‌కేస్ అందించి, కారెక్కేను. ఇంతలో ప్రసాద్, "జూబిలీ హిల్స్‌కే కదా

వెడుతున్నది. దార్లో జర్నలిస్ట్ కాలనీలో దిగిపోతాను. నా మెసేజ్ అందినట్టు లేదు. మా కారు రాలేదు" అంటూ డోర్ తీసి బ్రీఫ్‌కేసు ముందు సీట్లో పడేసి, వెనుక సీట్లో నా ప్రక్కన కూర్చున్నాడు. అతని చొరవకు నవ్వుకున్నాను.

"ఎందుకా నవ్వు! మీ సొంత కారైతే మొహమాటపడేవాణ్ణి. ఇది ప్రభుత్వ వాహనం కదా! అభ్యంతరం పెట్టే అమర్యాదస్తురాలివి కాదని నాకు తెలుసు" అన్నాడు, తను నవ్వుకుంటూ.

★ ★ ★

హైదరాబాద్ తిరిగి వెళ్లిన నాలుగైదు రోజుల తర్వాత మా మినిస్టర్‌తో బాటు నన్ను హిమ్స్ నర్సింగ్‌హోం చూడ్డానికి డాక్టర్ నందా తీసుకెళ్లేడు. అది చూశాక కళ్లు చెదిరిపోయాయి. అది హాస్పిటల్‌లా లేదు, ఫైవ్‌స్టార్ హోటల్లా వుంది. నాలుగంతస్తుల విశాలమైన మూడు భవనాల సముదాయం. సెంట్రల్ ఎయిర్ కండిషన్ సదుపాయం. అత్యంత ఆధునిక పరికరాలతో నూరు పడకల వరకు ఏర్పాటు చెయ్యడానికి అవకాశం వుంది. బిల్డింగ్ అంతా చూడ్డానికే గంట పట్టింది. సిటీ మధ్యలో అయిదెకరాల స్థలం సేకరించి ఇంత పెద్ద నర్సింగ్‌హోం కట్టడానికెన్ని కోట్లయిందో అంచనా వెయ్యడం కష్టం. దాని ప్లాన్‌వేసింది అమెరికన్ ఆర్కిటెక్ట్‌కే పది లక్షలిచ్చేరుట, ఆశ్చర్యం లేదు. అందులో మా మినిస్టర్ భర్త కూడా భాగస్వామి అని విన్నాను. రెండు నెలల్లో సెంట్రల్ హెల్త్ మినిస్టరొచ్చి ప్రారంభోత్సవం చేస్తాడట. అందుకే ఢిల్లీ వొచ్చి, అమెరికానుంచి తిరిగొస్తున్న నందాని కల్సుకొని వెంటబెట్టుకుని సెంట్రల్ హెల్త్ మినిస్టర్‌కి పరిచయంచేసి వెంటనే తిరిగొచ్చేసింది. నందా అక్కడ పనిచూసుకోడానికి ఓ రోజు ఆగేడు. నాకప్పగించిన పని మీద నేనూ ఆగి మర్నాడు కలిసి తిరిగొచ్చాం.

★ ★ ★

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ హెల్త్ మినిస్టర్ హిమ్స్ నర్సంగ్‌హోం ప్రోరంభోత్సవం చెయ్యబోతున్నట్లు, నందా మా ఆఫీసులో నన్ను కల్సుకుని చెప్పేడు. అభినందించేను. అదే సమయంలో అటెండర్ ప్రసాద్ విజిటింగ్ కార్డ్ తెచ్చేడు. లోపలికి పంపమన్నాను.

"ఏమిటి విశేషం మహాత్మా! ఊరకరారు జర్నలిస్టులు!" అన్నాను.

"ఓ! డాక్టర్ నందా యిక్కడే వున్నారే! ముందర ఆయనకి శుభాకాంక్షలు. హిమ్స్ నర్సింగ్‌హోం నవంబర్ ఒకటినట"

"థేంక్స్" అన్నాడు నందా.

కథా నిలయం
శ్రీకాకుళం

"గాంధి జయంతినాడు జపాన డెలిగేషన్ ఆగమనం. ఇప్పుడే ప్రెస్ మీట్‌లో సి.యం. చెప్పేడు. మొత్తం వాళ్లు డెబ్బయిమంది అక్టోబర్ రెండు నుంచి వారం రోజులుండి అక్టోబర్ తొమ్మిదిన తిరిగి వెడతారు. ఈ శుభవార్త మీకు చెబుదామని వొచ్చేను" అన్నాడు నాకేసి తిరిగి, తన సహజమైన కొంటె నవ్వుతో.

"వార్త శుభకరమే. ఆ వొచ్చే డెబ్బయి మందికీ భోజన వసతి ప్రదర్శన సదుపాయాలన్నీ సమకూర్చుకోవాలికదా! ఆ బరువు బాధ్యతల గురించి ఆలోచించండి" అన్నాను. ఈ రెండు వారాల వ్యవధిలోనూ ఏయే కమిటీలు ఏర్పాటు చేసి, ఎవరెవరికి ఏయే బాధ్యతలు అప్పగించాలో ఆలోచిస్తూ.

"ఈ ఏర్పాట్లు విషయంలో ఓ మంచి సలహా యివ్వనా?" అడిగేడు ప్రసాద్.

"మీ సలహా అవసరమనుకుంటే...." అని ఏదో అనబోతున్నాడు నందా.

"ఏమిటి ప్రసాద్ చెప్పండి" అడిగేను. అనవసరమైన ప్రసంగం చెయ్యడని తెలిసి.

"జపాన్ డెలిగేషన్‌కి భోజనం, వసతి, హస్త కళల ప్రదర్శనా, అమ్మకాలు హిమ్స్ నర్సింగ్‌హోంలో ఏర్పాటు చెయ్యండి. కల్చరల్ ప్రోగ్రామ్‌లకి సిటీ నడిబొడ్డున వుంది కాబట్టి ప్రజలు, ప్రభుత్వం సంతోషిస్తారు. అప్పటికి మీ నర్సింగ్‌హోం ప్రారంభోత్సవానికింకా మూడు వారాల టైముంది, అన్నీ సర్దుకుని శుభ్రపరుచుకోడానికి" అన్నాడు ప్రసాద్.

"మా పార్ట్‌నర్స్‌తో సంప్రదించాలి" అన్నాడు నందా నీళ్లు నములుతూ.

"సంప్రదించండి. అన్ని హంగులూ వున్నాయి. పైగా మీ నర్సింగ్‌హోంకి తెరవక ముందునుంచీ మంచి పబ్లిసిటీ వుంటుంది" అన్నాడు ప్రసాద్.

నిజమే, రెండు హాల్స్‌లో డెబ్బయి పడకలున్నాయి, కేంటీన్‌కి ఏర్పాటుంది. ఓ పక్క బిల్డింగ్‌లో ఎంక్వయిరీ, రిసెప్షనూ, స్టోర్సూ, ఆఫీస్, కమిటీ రూం, లెక్చర్ హాల్ లాంటివాటికోసం కేటాయించిన బిల్డింగ్ కింద రెండు అంతస్తులూ కాళీగానే వున్నాయి. అక్కడ ఎగ్జిబిషన్ పెట్టొచ్చు. మళ్లీ అన్నీ శుభ్రం చేసి సర్దుకోడానికి కావల్సినంత టైముంది. ఈ విషయం నేనే మా మినిష్టర్‌తో సంప్రదించి ఒప్పించగలనన్న నమ్మకముంది.

★ ★ ★

"నీ వ్యక్తిగత విషయాల్లో కలగజేసుకుంటున్నాననుకోకపోతే, నిన్నో ప్రశ్న వేస్తాను. నీకు అందచందాలున్నాయి, చదువు, హోదా వున్నాయి, పరిచయాలున్నాయి. నీ పెళ్లి విషయం ఆలోచించకపోవడానికి కారణమేమిటి?" అడిగింది మా మినిష్టర్, ఓ రోజున తీరుబడిగా మాట్లాడుకుంటున్న వేళ.

"నేను ఐ. ఏ. ఎస్. పాసైన మూడు నెలల్లో మా నాన్నగారు పోయేరు. ఆ తర్వాత మా అన్నయ్య, డాక్టర్ కిశోర్, న్యూరో సర్జన్, అమెరికా వెళ్లి అక్కడ మరో డాక్టర్ని పెళ్లి చేసుకుని సెటిలైపోయేడు. ఇంక యిప్పుడు నేనూ, మా అమ్మా వున్నాం. ఆమే నా తల్లీ తండ్రీ దైవం. నా పెళ్లి బాధ్యత ఆమె నెత్తిన పెట్టుకుంది. నన్ను విడిచిపెట్టి ఆమె వుండలేదు. పెళ్లి సంబంధం విషయం ఆమె నిర్ణయానికొదిలేసేను. ఆమె కూడా ఆ ప్రయత్నంలోనే వుంది" అన్నాను.

"మా మేనల్లుడు డాక్టర్ నందాతో నీకు పరిచయం వుంది. తెలివైనవాడు, ఆత్మాభిమానం వున్నవాడు, కోటీశ్వరుడు. నీకు యిరవై ఏడేళ్లున్నాయి. వాడికి ముప్ఫయేళ్లు. పెళ్లి కొడుకుగా వాణ్ణి గురించి నీ అభిప్రాయమేమిటి?" అడిగిందావిడ.

"డాక్టర్ నందాని ఒక మంచి స్నేహితుడుగా గౌరవించేను తప్ప నా కలాంటి అభిప్రాయం కలగలేదు" అన్నాను.

"మా దూరపు బంధువు డాక్టర్ మీనాక్షి సంగారెడ్డిలో గైనకాలజిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తుంది. ఆ అమ్మాయి తండ్రి కూడా హిమ్స్‌లో పెట్టుబడి పెట్టేడు. ఆ అమ్మాయిని వీడికిచ్చి పెళ్లి చెయ్యాలని ఆయన ఆశయం. కాని ఆ అమ్మాయి అంత బాగుండదు. నువ్వు 'యస్' అంటే అక్కడ 'నో' అంటాడు. పైగా నా మాటకాదనడు. ఈడూ, జోడూ మీరిద్దరూ బాగుంటారని నా అభిప్రాయం. ఆలోచించు." అంది. నేను ఇక్కడ 'నో' అంటే అతను అక్కడ 'యస్' అంటాడని నాకు అర్థమైంది.

"ఆ అమ్మాయి డాక్టర్, ఆమె తండ్రి వ్యాపారంలో భాగస్వామి అయినప్పుడు అది అన్నివిధాలా అనుకూలమైన సంబంధం. దాన్ని తోసిపుచ్చడం ధర్మం కాదు. పైగా ఇలాంటి ప్రతిపాదనవల్ల భాగస్వాముల మధ్య సత్సంబంధాలకు విఘాతం ఏర్పడే అవకాశం వుంది. మీరు బాగా ఆలోచించుకోండి" అని ప్రస్తావన అంతటితో నిలిపేసేను.

★ ★ ★

ఏర్పాట్లన్నీ హిమ్స్ భవన, సముదాయంలోనే చెయ్యడం వల్ల జపాన్ సాంస్కృతిక బృందం ఎంతో సంతోషించేరు. ఇంత అనుకూలమైన ఏర్పాట్లు ఎక్కడా జరగలేదన్నారు. వాళ్ల కార్యక్రమాలన్నీ అనుకున్నదానికంటే విజయవంతమయ్యేయి. నందా చాలా శ్రమపడ్డాడు. ఇంత మంచి సలహా యిచ్చిన ప్రసాద్‌ని మనసారా అభినందించేను. ఈ డెలిగేషన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలించి వుంటే "ఆలమట్టి కృష్ణ జలాలతో జపానీయులకు అభిషేకం" అంటూ తన పత్రికలో మన ప్రభుత్వాన్ని దుయ్యపట్టేవాడు. ఇప్పుడు సి. యం. కూడా సంతోషించేడు.

జపానీయులకి వీడ్కోలు ఏర్పాటు సందర్భంగా, గవర్నమెంట్ కారు మా ఆఫీస్ పరివారాని కొదిలేసి నా సొంత కార్లో ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళేను. అది చార్టర్డ్ ప్లేన్. రాత్రి తొమ్మిదింటికి బయల్దేరవల్సింది పదిన్నరయినా బయల్దేరలేదు. రాత్రి ఒక్కర్తినీ కారు డ్రయివ్ చేసుకుని వెళ్ళాలి. అందుచేత ఆ డెలిగేషన్ ప్రెసిడెంట్ దగ్గిర శలవు తీసుకుని బయల్దేరేను.

జర్నలిస్ట్ కాలనీ రోడ్ ఇంకో ఏభయ్ గజాలుందనగా రోడ్ మీద ఓ మనిషి నిలబడి రుమాలు ఊపుతూ కారు ఆపమని సౌంజ్ఞ చేసేడు. అతని వెనక్కాల రోడ్‌కి అడ్డంగా ఒక మనిషిపడి వున్నాడు. ఇంత అర్ధరాత్రివేళ రోడ్ ఏక్సిడెంట్ కేసులో తలదూర్చే సహనం, సాహసం నాకులేకపోయినా, ప్రభుత్వోద్యోగిగా నా విధ్యుక్త ధర్మం కనక, సంగతేమిటోకనుక్కుని, ఇంటికెళ్లి పోలీస్ కంట్రోల్ రూంకి ఫోన్ చేద్దామని కారు ఆపేను. ఆ రుమాలు ఊపిన వాడు వెంటనే మరో రుమాలు తీసి నా మొహానికి అదిమిపెట్టి రెండోచేత్తో నా తల కదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. రోడ్‌మీద పడుకున్నవాడు కూడా లేచొచ్చి కారుడోర్ తెరిచి– ఆ యిద్దరూ నన్ను చేతుల మీద మోసుకుపోతుండగా నాకు ఆ షాక్‌కి స్పృహ తప్పింది.

★ ★ ★

నా పరిసరాల్నీ, నా మానసిక, శారీరక పరిస్థితిని గుర్తించి 'అమ్మా' అని మా అమ్మనీ, 'అన్నయ్యా' అని స్టేట్స్ నుంచి వొచ్చిన మా అన్నయ్యనీ పలకరించడానికి వారం రోజులు పట్టింది. నాలుగు రోజులు నాకు స్పృహ లేదుట. తర్వాత కూడా స్పృహ వచ్చినా హిస్టీరికల్‌గా కేకలెయ్యడం, కాళ్లూ చేతులు ఆడిస్తూ గిజగిజ తన్నుకోవడం చేసేదాన్నిట. నన్ను శాంత పరచడానికి పెథిడీన్, మార్ఫిన్ ఇంజెక్షన్లిచ్చే వారుట.

వారం తర్వాత డాక్టరొచ్చి జరిగిన సంఘటన గురించి ఆలోచించవద్దనీ, ఆ సంఘటనకు సంబంధించిన వార్తాపత్రికలు చూడొద్దనీ దాన్ని గురించి మాట్లాడొద్దనీ హెచ్చరించేడు. మా అన్నయ్య న్యూరోసర్జనేమో విజిటర్స్ ఎవర్నీ లోపలికి రానిచ్చేవాడు కాదు. నాకు కాలక్షేపం కోసం నా కిష్టమైన సంగీతం కేసెట్లు వినిపించే ఏర్పాటు చేసేడు.

నన్ను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేసేరు. ఇప్పుడు శారీరకంగా స్వస్థత చేకూరినా, భవిష్యత్ గురించి ఆలోచిస్తే ప్రజలకునా మొహం ఎలా చూపెట్టనా అన్న సిగ్గుతో మనస్సు వికలమైపోతుంది. నేను షాక్‌తో కోమాలో వున్న నాలుగురోజుల్లోనూ సి. యం. తో బాటు మినిస్టర్లు, సెక్రటరీలు చూసి ఆందోళన, సానుభూతి వ్యక్తపరిచి వెళ్లేరుట.

"ఆ రాత్రి నిన్నా రౌడీలు రోడ్ పక్క కడుతున్న బిల్డింగ్ వెనక్కి మోసుకుపోయిన ఓ పావుగంటలో రాజు అనే జర్నలిస్ట్, నీ కారును చూసి ఆనవాలు పట్టి పరిశీలిస్తే ఫ్రంట్ డోర్ తెరిచి వుంది. కారు స్విచ్ కీ అలాగే వుంది. అనుమానాస్పదంగా వున్న ఆ పరిస్థితుల్లో అతను డ్రయివర్ సహాయంతో ఆ పరిసరాలు శోధిస్తుంటే నీ మూలుగు వినపడింది. ఆ దిశగా వెళ్లేటప్పటికి ఓ రౌడీ ఓ బండరాయి మోసుకు వొస్తుంటే ఫ్లేష్ గన్ సహాయంతో, తన కెమేరాతో వాడి ఫోటో తీసేడుట. వాడు వెంటనే రాయి అక్కడ పారేసి "లెగిసిరా... పోలీసులు పోలీసులు" అంటూ కేకలు పెట్టాడు. అది విని పునాది కోసం తీసిన గోతిలో వున్న రెండోవాడు బయటకొచ్చి పారిపోతుంటే వాడి ఫోటో కూడా తీసేడు. వాళ్లిద్దరూ తప్పించుకు పారిపోయేరు. గోతిలో పడివున్న నిన్ను కూడా ఫోటో తీసేడు. నువ్వింకా మూలుగుతుండటం చూసి డ్రయివర్ సహాయంతో నిన్ను కార్లో ఎక్కించుకుని, పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో రిపోర్టిచ్చి వెంటనే నిన్ను ఈ నర్సింగ్‌హోంలో జాయిన్ చేసేరు. వీళ్లా సమయానికి రాకపోతే ఆ బండరాయితో...."

"నా తల బద్దలు కొట్టి చంపేసుందురు" అని మా అన్నయ్య వాక్యం పూర్తి చేసేడు.

తర్వాత బలవంతం చేస్తే ఆ రాజు తీసిన ఫోటోలు చూపెట్టేడు. ఆ రాయి మోసుకొస్తున్న వాడే నా కారాపినవాడు. ఆ ఫోటోలు ఆధారంగానూ, పోలీస్ డాగ్స్ సహాయంతోనూ, ఫోరెన్సిక్ టెస్ట్‌ల ఫలితంగానూ ఆ యిద్దర్నీ పట్టుకుని నాన్ బెయిలబుల్ వారెంట్ మీద కస్టడీలోకి తీసుకున్నారుట. వాళ్లిద్దరూ ఇటీవల కరీంనగర్ జైలునుంచి పారిపోయిన ఖైదీలు. వాళ్ళ నేరాల్ని ఒప్పుకుంటూ వాఙ్మూలాలిచ్చేరుట. గోతిలో నగ్నంగా, గాయాలతో, లైంగిక అత్యాచారానికి గురయ్యేక, వికృతంగా, స్పృహ కోల్పోయి మృతదేహంలా పడివున్న నా ఫోటోను చూడగానే పేగులు మెలికలు తిరిగిపోయి భళ్లున వాంతి చేసుకున్నాను.

"అవసరమైన ఫోటోలు, కాగితాలు పోలీసుల దగ్గిరున్నాయి. ఇంక ఈ సంఘటనొక పీడకలగా మరిచిపో" అంటూ ఆ ఫోటోలు, వార్తాపత్రికల కటింగ్సూ నా ఎదురుగానే చింపిపారేసేడు.

"ఆ రాజు అనే జర్మలిస్టని నువ్వు కలిసేవా?" అడిగేను అన్నయ్యని.

"రోజూ వొచ్చి నీ యోగక్షేమాలు కనుక్కొనేవాడు, కనీసం ఫోనైనా చేసేవాడు. చాలా మంచివాడు. ఆంధ్ర మెయిల్ ప్రసాద్‌కి అతను బాగా తెలుసుట. ప్రస్తుతం వూళ్లో లేడుట. వొచ్చేక నీకు పరిచయం చేస్తానన్నాడు."

"ఏ తల్లి కన్న పుణ్యాత్ముడో! నేను కూడా వెళ్లి కలవాలిరా" అంది అమ్మ.

"ప్రసాద్‌తో చెప్పేను. అతను వాళ్లింటికి తీసుకెడతాడు" అన్నాడు.

★ ★ ★

పావుగంటలో పోలీస్ కమీషనర్ నరేందర్ వస్తానని ఫోన్ చేసేడు. నా వాఙ్మూలం యివ్వడానికి యిప్పటికే ఆలస్యమైందన్నాడు. రమ్మన్నాను. ఈలోగా "గుడ్ మార్నింగ్" అంటూ ప్రసాద్ ప్రత్యక్షమయ్యాడు.

"గుడ్ మార్నింగ్. జ్ఞాపకమున్నానా?" అని అడిగేను.

"అదేమిటి నేను రోజూ వొచ్చి మీ అన్నయ్యని కలిసి వెడుతున్నాను. మీ అన్నయ్యే నన్ను నీతో మాట్లాడ్డానికి వీల్లేదని ఆంక్షలు విధించేడు. ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అని అడిగేడు. ఇతరుల ముందు 'మిస్' 'మీరు' అని సంబోధిస్తాడు. ఒక్కర్తినే వుంటే ఏకవచనమే ప్రయోగిస్తాడు. మా పాత స్నేహం పురస్కరించుకుని. నేనూ అంతే.

"ఎందుకు బ్రతికున్నానా అని ఆలోచిస్తున్నాను" అన్నాను.

"నిత్యం ఎంతమంది స్త్రీలు అత్యాచారానికి గురవ్వడం లేదు! బ్రతికి బయటపడి మామూలు మనిషివయ్యేవు. సంతోషించు."

"ఇంత జరిగింతర్వాత ఇక్కడుండడం కంటే స్టేట్స్‌కి మా అన్నయ్యతో పోతే మంచిదేమో అనిపిస్తుంది" అన్నాను. ప్రసాద్ స్పందన విందామని. నిజానికి నేనంత బేలను కాను.

"నీకున్న రోగమే అది. నువ్వో ఐ. ఏ. ఎస్. ఆఫీసర్‌వి. కనక అత్యంత ప్రముఖురాలివనీ, నీ మీద అత్యాచారం జరగడమంటే ఆకాశం విరిగి భూమ్మీద పడిపోవడం లాంటిదనీ నీ వుద్దేశం. ప్రభుత్వోద్యోగినిగా, ఇలాంటి పరిస్థితి ధైర్యంగా ఎదుర్కొని సాటి స్త్రీలకి మార్గదర్శకురాలివి కావాలి. నువ్వేదో తప్పు చేసినట్టు పారిపోవడమెందుకు? ఆ నేరస్తులకి గట్టి శిక్ష పడేలా చెయ్యడం నీ కనీస ధర్మం."

ప్రసాద్ అలా అంటాడని నాకు తెలుసు. నిజానికి పోలీస్ కమిషనర్ రావడానికి ముందు ప్రసాద్ రావడం నా మనో బలాన్ని ద్విగుణీకృతం చేసింది.

"ఆ రాత్రి నా మెడలో గొలుసు, చేతి గాజులు, వేలి ఉంగరం, రిస్ట్ వాచ్ తీస్తుంటే స్పృహొచ్చింది. నా మాట వినపడకుండా నా నోటి కడ్డంగా రుమ్మాలు కట్టేసుంది. నేను నేల మీద మట్టిలో పడున్నాను. చుట్టూ చీకటి. మూల్గడానికి తప్ప అరవడానికి శ్వాస ఆడటం లేదు. ఒకవైపు వాడి నోటమ్మట వొచ్చే దుర్భరమైన ఘాటయిన దుర్గంధం. మరోవైపున నా తల కదలకుండా ఓ చేత్తో అణిచిపెట్టి రెండో చేత్తో నా జాకెట్టు, బ్రా చింపేసి నా వక్షోజాలు నలిపేస్తున్నాడు, కొరికేస్తున్నాడు. చేతుల్తో నెట్టేస్తూ, కాళ్లతో గిజగిజ తన్నుకుంటూ, తల ఆడిస్తూ, వాణ్ణి గెంటెయ్యాలన్న ప్రయత్నం చేస్తున్నాను. ఇంతలోకే

రెండోవాడు, వాడికి సాయమై నా చీరా, లంగా బలవంతంగా లాగేసేడు. భయంతో బాధతో ఊపిరాడకుండా మూలుగుతున్నాను. నా నడుమూ మర్మాంగం ఏకమైనట్లు ఒకటే పోట్లు. ఆ చిత్రవధను ప్రతిఘటించే శక్తీ, భరించే శక్తీ అంతరించింది. కళ్లు బైర్లు కమ్మేయి. స్పృహ కోల్పోయేను" అని పోలీస్ కమీషనర్‌కి నా వాఙ్మూలం యిచ్చేను.

"మిస్ మందాకినీ! కోర్టులో ఇలాంటి కేసుల్లో లాయర్లు అసభ్యకరమైన ప్రశ్నలతో వేధిస్తారు. ధైర్యంగా వాళ్లకి సమాధానం చెప్పాలి" అన్నాడు కమిషనర్.

"ఏమీ పర్వాలేదు. వాళ్లకీ తల్లీ, భార్య, కూతుళ్లూ వుంటారు కదా! ఎలా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. అవసరమైతే జడ్జీకి ఆయన ఛాంబర్‌లో నా చనుకట్లు పైన, మర్మాంగం మీద, క్రింది పెదవి మీదా పడిన కుట్లు చూపెట్టడానికి సిద్ధంగా వున్నాను. నా కోసం నేను పోరాడటం లేదు. సామాజిక న్యాయం కోసం. నేరస్తులకు కఠిన శిక్ష పడటమే నా లక్ష్యం. ఈ నా వాంఙ్మూలాన్ని ప్రెస్ వాళ్లకి కూడా యివ్వండి" అని చెప్పేను.

★ ★ ★

అన్నయ్య మరో వారం రోజుల్లో తిరిగి వెళ్లిపోతాడనగా, నా కారు మళ్లీ నేనే డ్రయివ్ చెయ్యడం మొదలెట్టేను. వెళ్లిపోయే రోజున అమ్మని ఎయిర్ పోర్ట్‌కి తీసికెడితే అక్కడ రాగాలు మొదలెడుతుంది. అమెని సముదాయించడం కష్టం అని నేనే బలవంతంగా మాన్పించేను.

"మింకీ! నువ్వు త్వరగా పెళ్లి చేసుకుని, మీ దంపతులిద్దరూ హనీమూన్‌కి స్టేట్స్‌కి వొస్తేనే కాని నా దారిన నేను అమెరికా వెళ్లి పోయిన పాపానికి నిష్కృతి లేదు" అన్నాడన్నయ్య ఎయిర్‌పోర్ట్‌లో. మా వాళ్లందరూ నన్ను 'మింకీ' అని పిలుస్తారు.

"నేను పెళ్లి చేసుకుని హనీమూన్‌కి రావడమా! కలలు కంటున్నావా అన్నయ్యా!" అన్నాను. అన్నయ్య నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటుండగా.

"త్వరలోనే పెళ్లవుతుంది. చూస్తూ వుండు. కలలు కనడం లేదు. నిజం చెబుతున్నాను. ఛియరప్ మింకీ!" అటూ- నా మొహం తన చేతుల్లోకి తీసుకుని, నుదుట ముద్దు పెట్టుకుని, నవ్వుతూ నా కళ్లలోకి చూస్తూ అన్నయ్య చెయ్యూపుతూ వెళ్లిపోతుంటే నా కళ్లలో నీరు దాగలేదు. మౌనంగా చేయూపేను.

ఎయిర్‌పోర్ట్ నుంచి తిరిగొస్తుంటే సాయింత్రం ఏడు గంటలైంది. సరిగ్గా జర్నలిస్ట్ కాలనీ రోడ్ మలుపు దగ్గిర రోడ్ మీద నిలబడి ఎవరో కారాపమన్నట్టు సౌంజ్ఞ చేస్తుంటే చూసి అతను ప్రసాద్ అని ఆనవాలు పట్టి కారాపి డోర్ తెరిచేను. వొచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు.

"ఎందుకు కారాపేవు?" అడిగేను.

"నిన్ను రాజు యింటికి తీసుకురమ్మని మీ అమ్మగారి ఆదేశం" అన్నాడు.

"మా అమ్మ ఆయనింటికెప్పుడు వెళ్ళింది?" అడిగేను.

"నేను మీ యింటికెడితే నువ్వు లేవు. ఆమె బిక్కు బిక్కుమంటూ దిగులుగా కూర్చుంది. రాజుని చూస్తానన్నారుగా, రాజు యింటి కొస్తారా తీసుకెడతాను" అన్నాను. అతని తల్లిని కలుసుకుంది. తీరా అక్కడికొచ్చేక రాజు తల్లి తన పాత స్నేహితురాలేనని తెలిసుకుంది. వాళ్లు పది నిముషాలు మాట్లాడుకున్నారో లేదో నీ పెళ్లిచూపులకిప్పుడు ఏర్పాటు చేసుకున్నారు. ఇంక ముహూర్తం పెట్టడమే తరువాయి అన్నంత సంబరపడుతున్నారు"

ఈ పరిస్థితిలో ముక్కూ మొహం తెలియనివాడితో పెళ్లిచూపులా! మా అమ్మకి మతిలేకపోతే వాళ్లకేనా వుండొద్దూ! నాన్‌సెన్స్. కారు దిగు. నేను మరో రోజున కల్సుకుని కృతజ్ఞత చెప్పుకుంటాను" అన్నాను ఈ హఠాత్పరిణామానికి విస్తుపోతూ.

"నా మాట విను. మీ అమ్మగారూ వాళ్లూ చిన్నబుచ్చుకుంటారు. రాజు చాలా బుద్ధిమంతుడు, అందమైన యువకుడు. విశాల భావాలున్నవాడు. మంచి అంతస్తు, ఆస్తిపాస్తులు వున్న సంబంధం."

"థేంక్స్ ఫర్ యువర్ ఎడ్వయిజ్. కాని ఆస్తులు అంతస్తుల కోసం నేనెప్పుడూ ఏడవలేదే! నా ప్రాణం కాపాడినందుకు కృతజ్ఞత చెప్పుకుంటాను. సి.యం.తో చెప్పి గేలంట్రీ ఎవార్డు యిప్పిస్తాను. అసలు నువ్వతనికి నా గురించి ఏం చెప్పేవు?"

"నీ మంచితనం, నీ అందచందాలు, అధికార హోదా వగైరాలన్నీ చెప్పేను. అతను సంతోషంగా పెళ్లి చేసుకోడానికంగీకరించేడు"

"ప్లీజ్ ప్రసాద్! నన్నవమానించడానికింతకంటే మార్గం దొరకలేదా!"

"నిన్ను అవమానించడమా! వాద్దూయూ మీన్!"

"నా మనస్సు నీకు తెలియదా! ఆస్తిపాస్తులు కోరుకున్నదాన్నయితే మనం పెళ్లి చేసుకుందామని ఎలా అనుకున్నాం! నిశ్చితార్థం చేసుకునేలోగా మీ నాన్నగారు పోయేరు. మరో ఆరు నెలల్లో మా నాన్నగారు పోయేరు. ఈలోగా ఐ.ఏ.ఎస్. పాసయ్యేను. మూడేళ్లు కర్నూల్లో జాయింట్ కలెక్టర్‌గా వున్నాను. అక్కడుండగానే మా అమ్మ మీ అమ్మగార్కి మన పెళ్లి ప్రస్తావన చేస్తూ వుత్తరాలు రాసింది. మూడు నెలలక్రితం మినిస్టర్ సెక్రటరీగా యిక్కడ పోస్టింగొచ్చింది. ఇక్కడికొచ్చేక కూడా...."

"అవును మీ అమ్మగారు మా అమ్మని కలిసి మన పెళ్లి సంగతడిగేరు. "వాడిష్టం నా ప్రమేయమేముందీ! మీ అమ్మాయినే మా వాడితో మాట్లాడమను" అని చెప్పిందిట కదా! మరి నువ్వు మాట్లాడలేదు. మనస్సు మార్చుకున్నావేమో అనుకున్నాను."

"అలా అనుకుని నాకు వేరే మంచి సంబంధం చూశానంటావు. హుఁ! నీ నిజస్వరూపం యిప్పుడు తెలిసింది. 'నా మీద జరిగిన ఈ అత్యాచారం ఫలితంగా మనస్సు మార్చుకున్నది నువ్వు. ఆల్‌రైట్. ప్లీజ్ గెట్ డౌన్. నీలో యింకా ఏమైనా మానవత్వం మిగులుంటే మా అమ్మని ఓ ఆటో రిక్షా ఎక్కించి పంపించెయ్యి" అన్నాను.

"నా మాట విను, మంకీ, సారీ మింకీ! ఇది చాలా మంచి సంబంధం. ఒకప్పుడు మీ నాన్నగారూ అతని నాన్నగారూ మంచి స్నేహితులు. అతని చెల్లెలు నీ క్లాస్‌మేటుట. అతన్ని అందరూ యింట్లో 'రాజూ' అని పిలుస్తారు. అతని పూర్తి పేరు రాజేంద్ర ప్రసాద్..." అంటుంటే ఒక్క క్షణం నిర్ఘాంతపోయి సంతోషం పట్టలేక ప్రసాద్ చేతుల్లో నా మొహం దాచుకున్నాను.

** రచన, ఫిబ్రవరి 1999*